

9వ నివేదిక ఫిబ్రవరి 28, 2026

# ఫిజి నుండి ఫ్రంట్‌లైన్స్ వరకు

జోర్డాన్ -ఫిజి

ఇదంతా నా హృదయంలో రగిలిన ఒక అగ్నితో ప్రారంభమైంది, అది నేను విస్మరించలేని పిలుపు. 2023లో, నా కథను పాడ్‌కాస్ట్‌లో పంచుకున్న తర్వాత, నేను ఏదో గొప్ప విషయం యొక్క అంచున ఉన్నానని నమ్మాను. కొన్ని నెలల తర్వాత, నేను దేవుడు నన్ను పంపించు చోట సేవ చేయాలనే ఆశతో మరియు ఆశాజనకంగా, వేదాంతశాస్త్రంలో డిగ్రీతో పట్టభద్రుడనయ్యాను.

టోంగా మిషన్ లోని చాప్లిన్సీ ఉద్యోగానికి నేను మొదటిగా దరఖాస్తుచేశాను. అందుకు ప్రతిస్పందనగా టోంగా మిషన్ నుండి రెండు వారాల తర్వాత నాకు సానుకూల సమాధానం వచ్చినప్పుడు, నేను ఉత్సాహంతో నిండిపోయాను మరియు నమ్మకంగా ప్రార్థించాను, ఇదే నా మొదటి అధికారిక మిషనరీ పదవి అని నమ్మాను. కానీ ఆ ఉద్యోగం తలుపు తెరిచినంత త్వరగా అది మూసుకుపోయింది. మిషన్ వారు తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, నా అవసరత వారికి లేదని చెప్పారు.

నేను ఇతర ఎడ్వెంటిస్ట్ సంస్థలలో మిషన్ పరిచర్య కొరకు దరఖాస్తు చేసుకున్నాను, కానీ ఎక్కడా పని దొరకలేదు. నేను నిరుత్సాహపడ్డాను. నేను ఎవరికి కనబడనట్లు, నన్ను నేను మరచిపోయినట్లు భావించాను. కానీ అప్పుడు, నా పూర్వ ఉపాధ్యాయులలో ఒకరైన డాక్టర్ టబువా తుయిమా నా కళ్ళలోకి చూస్తూ, “లోకంలోకి అడుగు పెట్టే ముందు ఫిజిలో నీ పరిచర్యను ప్రారంభించు” అని అన్నారు. ఆయన మాటలు నా హృదయంలో నాటుకున్నాయి.

కొంతకాలం తర్వాత, నేను ఫిజి మిషన్ మినిస్టీరియల్ కార్యదర్శిని కలిశాను. మిషన్ కార్యాలయానికి అధికారిక అభ్యర్థన పంపమని ఆయన నన్ను ప్రోత్సహించారు. వినయపూర్వకమైన హృదయంతో, స్థానిక ఫిజి భాష మాట్లాడేవారిలో సేవ చేయాలనే మరియు కమ్యూనికేషన్ రంగంలో పనిచేయాలనే కోరికను వ్యక్తం చేస్తూ నేను ఒక సాధారణ రెజ్యూమ్ను సమర్పించాను.

2024 వ సంవత్సరం, మార్చినెల చివరిలో, నేను ఊహించని తలుపును దేవుడు నా కొరకు తెరిచాడు. నగరంలో మూడు చర్చిలను పర్యవేక్షించే బాధ్యత నాకు అప్పగించబడింది. నాకు బిరుదు లేదా జీతం లేదు. కేవలం పరిచర్య కొరకైన పిలుపు, ఇష్టపడే హృదయం మరియు లక్ష్యం.

నేను పని ప్రారంభించిన మొదటి రోజు నుండే తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొన్నాను. భాషకు సంబంధించిన అవరోధం, నేను ఎక్కవలసిన ఒక పెద్ద పర్వతం వలె ఎదురయ్యింది.

. ఫిజి భాషలో అనర్గళంగా ఎలా బోధించాలో, ప్రార్థించాలో, పరిచర్య చేయాలో నేను త్వరగా నేర్చుకోవలసి వచ్చింది. మా సంఘ పెద్ద గారి భార్య, " మా కొత్త పాస్టర్ ఇంగ్లీషులో బోధిస్తాడు కాబట్టి, మా సభ్యుల్లో కొంతమంది ఆయనను ఇష్టపడరు." అని అన్నారు. "మిషన్ వారు ఎందుకు ఇంత చిన్న వయస్సు వ్యక్తిని పంపించారు "అని మరికొందరు ప్రశ్నించారు.. నా వయసు అప్పటికి 22 సంవత్సరాలు మాత్రమే. వారి మాటలు నామనసుకు బాధ కలిగించాయి. నేను పట్టుదలతో ప్రార్థించాను. నా రోజువారీ ప్రణాళిక(షెడ్యూల్) వివిధ కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉంది. సబ్బాతు దినకార్యక్రమములు నాకు ఒక సుదీర్ఘమైన మారథాన్ పరుగు వలె ఉండేది.

ఒక చర్చిలో సబ్బాతు బడి నిర్వహించడం, మరొక చర్చిలో దైవారాధన నిర్వహించడం మరియు మూడవ చర్చిలో యూత్ కార్యక్రమాలు నిర్వహించడం చేసేవాడిని. ఇంకా వారం రోజులపాటు జరిగే వీక్ అఫ్ ప్రేయర్ సమావేశాలు, యవ్వనస్తుల కార్యక్రమాలు మరియు స్మాల్ గ్రూప్ పరిచర్యలు కూడా నిర్వహించే వాడిని. కానీ బిజీగా ఉండటం మధ్య ఏదో చక్కని పరిణామం జరిగింది: నేను నా సంఘ విశ్వాసులను ప్రజలను అర్థం చేసుకోవడం ప్రారంభించాను. వారి భాష నా భాషగా మారింది. వారి యొక్క నమ్మకం నాకు బహుమతిగా మారింది. అప్పుడు, మే నెల లో, ఒక కొత్త అధ్యాయం మొదలయ్యింది. హోప్ FM రేడియో వారి " కోస్ట్ టు కోస్ట్ బ్రేక్ఫాస్ట్ షో" ప్రసారాలు ఫిజిలోని మా చర్చి ద్వారా నిర్వహించడానికి నన్ను ఆహ్వానించారు. మొదట, నాకు భయం వేసింది. నాకు మాటలు రావడం లేదు, పరికరాలు దొరకడం లేదు, అర్థరాత్రి వరకు జరిగే పరిచర్య వల్ల నేను తీవ్రంగా అలసట చెందాను. టెక్స్ట్ సందేశాలు మరియు ఇమెయిల్ల ద్వారా ప్రతికూలమైన సందేశాలు వచ్చాయి. కానీ ఈ కార్యక్రమాన్ని నేను విడిచిపెట్టలేదు. నేను దేవుని వాక్యం పఠించాను, విన్నాను, ఆధ్యాత్మికంగా ఎదిగాను. క్రమంగా రేడియో ద్వారా నా స్వరం ఫిజీలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా సుపరిచితమైంది. హోప్ FM ప్రసారంలో, నేను సాక్ష్యాలను పంచుకున్నాను, సంఘ సిద్ధాంతాలను, లేఖనాలను వివరించాను మరియు శ్రోతలను ప్రోత్సహించాను.

అయితే నేను వ్యక్తిగత తుఫానుతో పోరాడుతున్నాను. నాకు ఆదాయం లేదు, అయినప్పటికీ ఇతరులకు సహాయం చేయడానికి నేను భారాన్ని మోశాను. నా 16 ఏళ్ల సోదరి చదువుకు నేను మద్దతు ఇచ్చాను మరియు కష్టాల కారణంగా పాఠశాల మానేసిన నా కజిన్‌కి కూడా అదే అవకాశాన్ని అందించాను. దేవుడు ఇస్తాడని నమ్మి, వారి ఫీజులను మూడు పర్యాయాలు భరిస్తానని నేను వాగ్దానం చేసాను. అది కష్టం, కానీ నేను ఎప్పుడూ ఆకలితో ఉండలేదు. నా ప్రధాన సంఘపెద్ద నేను ఎక్కడికైనా వెళ్లాలంటే నాకు లిఫ్ట్ ఇచ్చేవాడు, కొన్నిసార్లు నాకు ఒక చిన్న బహుమతిని ఇచ్చేవాడు. ఆయన దాతృత్వాన్ని నేను ఎప్పుడూ మర్చిపోలేదు.

సోమవారం నాకు ఉన్న ఒకే ఒక్క సెలవు రోజు. అయితే ఆ రోజు కూడా నేను సెలవు తీసుకోకుండా ఒక నర్సింగ్ హోమ్‌లో స్వచ్ఛందంగా పనిచేసేవాడిని. దేవుడు నాకు వినయం నేర్పించాలని ప్రార్థిస్తూ, వృద్ధాప్యంలో ఉన్న వారికి నేను సేవ చేశాను. ముడతలు పడిన వారి చేతులు మరియు కృతజ్ఞత చూపే వారి కళ్ళ ద్వారా దేవుడు నాకు వినయం

నేర్పించాడు. తరువాత, మూగ, చెవిటి పిల్లలకు నేర్పించే ప్రాథమిక సంజ్ఞా భాషా కోర్సులో నేను చేరాను. నేను ఆరు నెలల పాటు వారానికి రెండుసార్లు హాజరయ్యే వాడిని. నేను నవంబర్ 2024లో పట్టభద్రుడయ్యాను, అదే నెలలో నేను ఇద్దరు అమ్మాయిల పాఠశాల ఫీజులు చెల్లించాను. నిజంగా ఇది ఒక అద్భుతం.

నేడు, నేను ఇండోనేషియాలోని తూర్పు జావాలో ఉన్నాను, ఇంటి నుండి దూరంగా ఉన్నప్పటికీ, దేవుడు నన్ను కోరుకునే చోట ఉన్నాను. నేను ఒక అకాడమీలో ఇంగ్లీష్ బోధిస్తున్నాను. విద్యార్థులను క్రీస్తులాంటి స్వభావం కలిగి ఉండునట్లు వారిని దేవుని వైపు నడిపిస్తాను. యేసు క్రీస్తు యొక్క వాక్యమును బహిరంగంగా ప్రకటించుటకు అంగీకరించని ప్రదేశంలో బోధించగలుగునట్లు విద్యార్థులను ప్రోత్సహించుచున్నాను.

నేను కష్టపడుతున్నాను. నేను ఒంటరిగా ఉన్నాను. కనుచూపు మేరలో చర్చి లేదు. అయినప్పటికీ ప్రతిరోజూ ఆ అవసరత నాకు గుర్తు చేయబడుతోంది: ఇది మన మిషన్ ఫీల్డ్. "యేసు నా నిరంతర సహచరుడు, నా ప్రాణ స్నేహితుడు" అనే సత్యాన్ని నేను అంటిపెట్టుకుని ఉన్నాను. నేను వెళ్లుదును ( ఐవిల్‌గో) కార్యక్రమంలో భాగం కావడం నాకు గౌరవంగా ఉంది:

### నేను నా కుటుంబంయొద్దకు వెళ్లుదును:

దేవుడు నా ప్రార్థనలకు సమాధానం ఇచ్చాడు మరియు నా తల్లిని వ్యసనం నుండి విడిపించాడు.

### నేను నా పొరుగువారి వద్దకు వెళ్లుదును:

నా బంధువు తిరిగి పాఠశాలకు వెళ్లడానికి సహాయం చేసాను.

### నేను నా కార్యాలయానికి వెళ్లుదును:

మీడియా మరియు రచనల ద్వారా సేవ చేయడానికి నా స్వరం మరియు సమయాన్ని ఇచ్చాను.

### నేను భూమి చివరలకు వెళ్లుదును:

మరియు ఇప్పుడు నేను ఆయన నామాన్ని స్వేచ్ఛగా మాట్లాడలేని దేశంలో సేవ చేస్తున్నాను, కానీ నేను అక్కడ ధైర్యంగా జీవించగలను. ఇది నా విశ్వాసం, సేవ మరియు సమర్పణతో కూడిన ప్రయాణం. ఫిజి నుండి తూర్పు జావా వరకు దేవుడు నన్ను ప్రతి అడుగులోనూ నడిపించాడు.

గత సంవత్సరాలలో ఇవ్వబడిన పదమూడవ సబ్బాతు కానుకలలో కొంత భాగం దక్షిణ పసిఫిక్లోని హోప్ ఛానల్ టెలివిజన్ & హోప్ FM రేడియో పరిచర్య శాఖలకు మద్దతు ఇవ్వడంలో సహాయపడింది. మీరు సమర్పించనైయున్న ఈ త్రిమాసం యొక్క మీ పదమూడవ సబ్బాతు కానుకలకై మీకు మా కృతజ్ఞతలు. ఈ కానుకలు సోలమన్ దీవులు మరియు వనువాటులోని పిల్లల ఆరోగ్య ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడంలో సహాయపడుతుంది.

మికా తుయిమాకు, జోర్డాన్ వెదరాల్ చెప్పిన సాక్ష్యము